క్లుప్తంగా

వెండి ప్లేటు విరాళం

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో స్వామి వారికి నైవేద్యం సమర్పించేందుకు 248 గ్రాముల వెండి ప్లేటును ఈఓ వీరయ్యకు శుక్రవారం దాతలు పారా చంద్రన్న, సువర్ణమ్మ కుటుంబ సభ్యులు పారా రవికుమార్, సరిత, శశాంక్‌దత్త, ఆదిత్య అందజేశారు.అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు ప్రసాదాన్ని అందజేశారు.

గోకులం షెడ్లు ప్రారంభం

పత్తికొండ(తుగ్గలి) : పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుచ్చకాయలమాడలో గోకుల షెడ్లను ప్రారంభించారు. ఎంపీడీఓ సువర్ణలత, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, సర్పంచ్ అనిత, ఎంపీటీసీ సభ్యుడు చంద్ర కలిసి రూ.3లక్షలతో నిర్మించిన రెండు గోకుల షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీడీ పక్కీరప్ప, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఉపాధి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్య శిక్షణ

పత్తికొండ(తుగ్గలి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ శుక్రవారం ముగిసింది. సంస్థ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు ఏపీజీబీ సీనియర్ మేనేజర్లు వినోద్ కుమార్, మారుతీప్రసాద్ ఆర్థిక ప్రణాళిక, బ్యాంకు లావాదేవీలు, ప్రాజెక్టు రిపోర్టు, సిబిల్ రిపోర్టు, అప్లికేషన్ ప్రాసెస్ అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ట్రైనర్లు అల్తాఫ్, నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కృష్ణగిరి: మండల కేంద్రంతోపాటు ఆగవేలి, కంబాలపాడు సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం గం.5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మద్దిలేటి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణగిరి 220 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో సరఫరాలో అంతరాయం ఉండనుందన్నారు. అంతరాయం ఉన్న గ్రామాల రైతులకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని, గమనించాలని ఆయన కోరారు.

బిల్లుల చెల్లింపులో మెలిక



ఆలూరు: స్థానిక విద్యుత్ శాఖ ఏఆర్‌ఓ కార్యాలయం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన నోటీస్ బోర్డును చూసి రైతులు అవాక్కవుతున్నారు. సన్న,చిన్నకారు రైతులకు ఉన్న బోరు బావుల విద్యుత్ కనెక్షన్‌కు ఉన్న విద్యుత్ బిల్లుతోపాటు గృహ వినియోగానికి సంబంధించిన రెండు బిల్లులను చెల్లించాలన్నారు. ఏ బిల్లు చెల్లించకపోయినా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చాలా మంది రైతులు గతంలో తవ్వించిన బోరు బావులకు ప్రస్తుతం ఉన్న విద్యుత్ కనెక్షన్ కొందరు తొలగించుకున్నారు. అయితే అదే సెల్ నంబర్‌కు గృహ వినియోగ, బోరుబావులకు లింక్ కావడంతో తాము ఇబ్బందుకు గురవుతున్నామని కొందరు రైతులు వాపోయారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోండి

కృష్ణగిరి: మండల కేంద్రంలోని ఏకల్ విద్యాలయ ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానందుని జయంతిని నిర్వహించారు. వివేకానందుని ఆదర్శవంతమైన జీవితంపై అవగాహన కల్పిస్తూ పట్టణ వీధుల్లో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మారు మాట్లాడుతూ విద్యార్థులు వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వివేకానందుని వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నా రు. విద్యాలయ నిర్వాహకులు మాతాజీ పూజి త, తేజారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దహ్యాటను ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలి

హొళగుంద: పెద్దహ్యాట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మల్లయ్య, సోమశేఖర్‌గౌడ్, వీరేశ్, దొడ్డబసవనగౌడ్, వీరభద్ర, నాగరాజు తదితరులు తహసీల్దారు సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం గ్రామంలో రీ సర్వే పై గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నహ్యాట గ్రామ పంచాయతీకి పెద్దహ్యాట, బీజీ హళ్లీ గ్రామాలు మజరాగా ఉన్నాయన్నారు. పెద్దహ్యాట గ్రామంలో దాదాపు 200 కుటుంబాలు ఉన్నాయని ప్రతి చిన్న పనికి కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నహ్యాటకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కూడా అంతంత మాత్రంగానే ఉందని చెప్పారు. మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేసి, చెడిపోయిన చేతిపంపులకు మరమ్మతు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. డీటీ నిజాముద్దీన్, సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలందుకున్న కర్లకుంట తిరుమల రాయుడు


పత్తికొండలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలందుకున్న స్వామి


హెబ్బటంలో ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి


పెరవలిలో..పవళించిన విష్ణుమూర్తి ముగ్గు

విష్ణు రూప దర్శనం..సర్వపాప హరణం

- వైభవంగా ముక్కోటి ఏకాదశి
- కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం
- ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

పత్తికొండ(తుగ్గలి) : ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం ద్వారా శ్రీవారిని దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో వేకువజామునే ఆలయ ధర్మకర్త శివరామకృష్ణయ్యఆధ్వర్యంలో పురోహితులు ఉపేంద్ర, భాస్కర్‌స్వామి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 5.30 గంటల నుంచి సర్వ దర్శనానికి భక్తులను అనుమతించారు. భక్తులందరూ వేంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.

ఆస్పరి: మండల కేంద్రంలో జనార్ధన స్వామి, తంగరడోణలో చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వామి, హాలిగేరి సమీపంలోని కొండల్లో కూర్మనారాయణ స్వామి (నల్లగుట్టయ్య) స్వామి ఆలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. కూర్మనారాయణస్వామిని ఎంపీపీ సుంకుర ఉమాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. శనివారం ద్వాదశి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణానికి హాజరైన జనం

మద్దికెర : పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వాముల వారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారమున భక్తులకు దర్శన మిచ్చారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని దేవాలయ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. మద్దికెరలోని చెన్నకేశవస్వామి, నగిరేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు ఉత్తరద్వార దర్శమిచ్చారు.

కృష్ణగిరి: మండలంలోని కర్లకుంట గ్రామంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమల రాయుడిని ఉత్తర ద్వారం గుండా భక్తులు వేలాదిగా దర్శించుకున్నారు. ఆలయంలో సుదర్శన హోమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం కమనీయంగా సాగింది.

హొళగుంద: మండలంలో హెబ్బటం, హొన్నూరు కొట్టాల తదితర గ్రామాల్లో భక్తులు ఆలయాలకు వెళ్లి వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు.

ఆలూరు: స్థానిక రుక్మిణి విఠల పాండురంగ స్వామి


పెరవలిలో ఉత్తర ద్వారంలో దర్శించుకుంటున్న భక్తులు

ఆలయంలో ఉత్తర ద్వారంలో భక్తులు ఆలయంలోకి ప్రవేశించిన స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు రామమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి గంగ పూజ,ఫల,పుష్ప పంచామృతాభిషేకం, మహామంగళ హారతి తదితర రకా లుగా పూజలను ని ర్వహించారు.

భక్తులతో పోటెత్తిన రామళ్లకోట

వెల్దుర్తి: రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. స్వామి వారి ఉత్తదర్వార దర్శనంతో భక్తులు పులకించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవిలతో వనం వేంకటేశుని


ప్రత్యేక అలంకరణలో వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి

కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. డోన్ ఏసీజే జడ్జి తంగమణి, వెల్దుర్తి తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సమీర్‌కుమార్ రెడ్డి, శ్రీరాం రెడ్డి, కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు కాంతారెడ్డి, సుబ్బరాయుడు, బలరాం గౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, రమాకాంత్‌రెడ్డి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. వెల్దుర్తి, బేతంచెర్ల మండలాల శివారు ప్రాంతం శ్రీరంగాపురం కొండల్లో వెలసిన పాలుట్ల రంగస్వామి కల్యాణం శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో కమనీయంగా సాగింది. మదార్‌పురంలో శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో రాయలకాలం నాటి శ్రీరాముల వారి దేవాలయంలో సీతారామలక్ష్మణులు భక్తులకు ఉత్తరద్వార దర్శనం ఇచ్చారు. జర్నలిస్ట్ కాలనీలో వేంకటేశ్వరస్వామి కల్యాణం వేడుకగా జరిపించారు.


రామళ్లకోటలో డోన్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి


కూర్మనారయణస్వామి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు


కర్లకుంట తిరుమల రాయుడి ఆలయంలో ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం


కర్లకుంట తిరుమల రాయుడి ఆలయంలో జరుగుతున్న సుదర్శన హోమం

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

వెల్దుర్తి: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని మండలంలోని శ్రీరంగాపురం కొండల్లో వెలసిన పాలుట్ల రంగస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం న్యూ కేటగిరి వృషభాలకు నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. 6వేల అడుగుల దూరం బండను లాగిన డోన్ మండలం కొత్తకోట గ్రామ డాక్టర్ గురునాథ్ వృషభాలు విజేతగా నిలిచి రూ.40వేలు గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాల్లో వరుసగా ప్యాపిలి తోపుల శ్రీనివాసులు, ఇటిక్యాల కనపల్లి చక్రవర్తి గౌడ్ వృషభాలు సంయుక్తంగా, మిడుతూరు అలగనూరు కట్టుబడి రోలి వృషభాలు, వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు గొల్లపల్లి వారాది రాం చరణ్ ఎద్దులు, ప్యాపిలి రంగాపురం జూటూరు చిన్నారెడ్డి, అనంతపురం పుట్లూరు అరకటివేముల సోమశేఖర్ నాయుడు వృషభాలు సంయుక్తంగా నిలిచాయి. వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు గెలుచుకున్న వృషభ యజమానులకు దాత జయరామిరెడ్డి నగదు బహుమతులందించారు.


ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జయరామిరెడ్డి

ఇరుముడితో శబరిమలకు

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో 22 మంది అయ్యప్ప మాలధారులు శుక్రవారం ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వామి నరసప్ప ఆధ్వర్యంలో దీక్షాపరులకు ఇరుముడి కట్టి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం మాలధారుల బంధువులు, కుటుంబ సభ్యులు, మిత్రులు వారిని ఊరేగింపుగా సాగనంపారు. ఈ కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.

హొళగుంద: మండల కేంద్రంలో శుక్రవారం అయ్యప్ప మాలధారులు శబరిమలకు తరలి వెళ్లారు. మాలదారులు ఉదయమే స్థానిక అయ్యప్ప అలయం వద్దకు చేరుకుని స్వామి విగ్రహానికి పూలు పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, మహామంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేశారు. స్వామి, మెట్లను దీపాలు, పూలతో అలంకరించారు. అనంతరం మాలధారులు ఇరుముడి స్వీకరించగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు వీడ్కోలు పలికారు. రెండు బస్సుల్లో 60 మంది బయలుదేరారు.


ఇరుముడి కడుతున్న గురుస్వామి నరసప్ప


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి


మాలధారులను సాగనంపుతున్న బంధువులు సభ్యులు

కంది దిగుబడి దగ్ధం


కాలి బూడిదైన పంట దిగుబడి

వెల్దుర్తి: త్నపల్లె గ్రామ రైతు తన రెండున్నర ఎకరాల పొలంలో పండించిన కంది పంటను కోయించి దిగుబడిని పొలంలోనే కుప్పగా పోశాడు. శుక్రవారం మధ్యాహ్నం పంట దిగుబడి కుప్ప మొత్తంగా నిప్పంటుకుని కాలి బూడిదైపోయింది. గుర్తుతెలియన వ్యక్తులు నిప్పంటించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ఆదుకోవాలని కోరాడు.

50 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు

తుగ్గలి : 2024–25 ఆర్థిక సంవత్సరానికి బీసీ యాక్షన్ ప్లాన్ కింద మండలానికి 50 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ శుక్రవారం తెలిపారు. బీసీ–ఏ కేటగిరీకి 21 యూనిట్లు, బీసీ–బి 12, బీసీ–డి7, బీసీ–ఈ కేటగిరీకి 10 కేటాయించారన్నారు. తుగ్గలి ఏపీజీబీకి 21 యూనిట్లు, జొన్నగిరి బ్యాంకుకు 14, పెండేకల్లు రైల్వే జంక్షన్ స్టేట్ బ్యాంకుకు 15 యూనిట్లు ఉన్నాయన్నారు. 50 శాతం సబ్సిడీతో ఇచ్చే ఈ రుణాలకు 21 నుంచి 60 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులను సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం


కారం నాగరాజు


చంద్రశేఖర్‌యాదవ్


ఆర్‌బి వెంకటరాముడు


బొమ్మన రవీంద్రనాథరెడ్డి


అట్ల గోపాల్‌రెడ్డి

పత్తికొండ(తుగ్గలి) : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం లోని ఐదు మండలాలకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

మండలం	అధ్యక్షుడి పేరు	మండలం	అధ్యక్షుడి పేరు
పత్తికొండ	కారం నాగరాజు	వెల్దుర్తి	బొమ్మన రవీంద్రనాథరెడ్డి
మద్దికెర	చంద్రశేఖర్‌యాదవ్		
కృష్ణగిరి	ఆర్‌బి వెంకటరాముడు	తుగ్గలి	అట్ల గోపాల్‌రెడ్డి

ఆర్థిక సాయం

వెల్దుర్తి: తమతో కలిసి పదవ తరగతి వరకు చదువుకున్న తోటి విద్యార్థిని రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందడం, ఆమె కుటుంబ పరిస్థితి తెలుసుకుని తమ వంతుగా సాయం కొనసాగిస్తున్నారు వెల్దుర్తి జెడ్పీహైస్కూల్ 1988–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. శుక్రవారం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఆమె కుమారుడు మనోజ్‌కుమార్‌కు అందించారు. హరిసింహనాయుడు, ఖలీల్, పరమేష్, షెక్షావలి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లు ప్రారంభం


గుండ్లకొండలో మినీ గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ కర్నూలు డివిజన్ ఉప సంచాలకులు దుర్గాప్రసన్న

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలోని నాలుగు మినీ గోకులం షెడ్లను శుక్రవారం పశుసంవర్ధక శాఖ కర్నూలు డివిజన్ ఉప సంచాలకులు డా.వి.దుర్గాప్రసన్న ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో మినీ గోకులం షెడ్లను మంజూరు చేసిందన్నారు. అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ సహాయ సంచాలకులు గోనెగండ్ల డాక్టర్ వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారి వెంకటేష్, వెలమకూరు, జేపీఓ శివ నారాయణరెడ్డి, ఏపీడీ పక్కీరప్ప, ఏపీఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

న్యాయం చేస్తాం

హొళగుంద: భూ వివాదానికి సంబంధించిన రికార్డులు పరిశీలించి అన్ని రకాలుగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం వివాదస్పదంగా మారిన హొళగుంద పరిధిలోని 365సీ1సీ సర్వే నంబరులోని భూమిని పరిశీలించారు. గ్రామానికి చెందిన బోయ మారెమ్మ అనే మహిళ తమ భూమికి పట్టాదారు పాసు బుక్కులు, ఆన్‌లైన్ అడంగల్ ఇతర రికార్డులు ఉన్నా అధికారులు వేరే రైతు పేరిట బదిలి చేశారని, తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయన శుక్రవారం విచారణ చేపట్టారు. సదరు భూమిని పరిశీలించి బాధితురాలి వద్ద ఉన్న పాసు బుక్కులు, అడంగల్ ఇతర పత్రాలను పరిశీలించి వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని అక్కడ రికార్డులను పరిశీలించి తహసీల్దారు సతీష్‌ను, వీఆర్‌ఓలతో భూమికి సంబంధించి పూర్వ పరాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాటాడారు.


వివాదాస్పద భూమి పత్రాలను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా

పత్తికొండ(తుగ్గలి) : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. స్థానిక ఈశ్వరరెడ్డి భవన్ నుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పార్టీ మండల కార్యదర్శి చక్రాల్ల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ..ట్రూ అప్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, చార్జీలను తగ్గిస్తామని చెప్పిన కూటమి నాయకులు.. పాలనలో అందుకు విరుద్ధంగా కోట్లాది రూపాయల భారాన్ని వినియోగదారులపై మోపిందన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ నారాయణస్వామికి వినతి పత్రం అందజేశారు. నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, రామాంజినేయులు, గంగన్న, హామీల, ప్రజా సంఘాల నాయకులు ఉరుకుందు, రంజిత్, వివేక్, మధు, వినోద్, రమేష్ రాముడు పాల్గొన్నారు.


పత్తికొండలో విద్యుత్ కార్యాలయం వద్ద ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఎన్నికల హామీలు నేరవేర్చాలి

మద్దికెర/పత్తికొండ(తుగ్గలి)/ఆస్పరి/దేవనకొండ/హొళగుంద: ఎన్నికలకు ముందు గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు లేని నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం, రూ.5 లక్షలు మంజూరు చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని అధికారం చేపట్టి ఏడు నెలలైనా అమలు చేయలేదని శుక్రవారం మద్దికెరలో సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, తాలూకా నాయకులు కారన్న, పత్తికొండలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, తుగ్గలిలో సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, ఆస్పరిలో బ్రహ్మయ్య, కృష్ణమూర్తి, దేవనకొండలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, హరికృష్ణ, హొళగుంద మండలంలో పెద్దహ్యాట గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప తదితరుల ఆధ్వర్యంలో ఆయా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేసి డిమాండ్ నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.